పకడ్బందీగా 'పది' పరీక్షలు

- కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల సమావేశంలో డీఈఓ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ జనార్ద న్‌రెడ్డి ఆదేశించారు. శనివారం రామకృష్ణ పీజీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 130 పరీక్ష కేంద్రాల్లో 25,542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, పరీక్షల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఒకరోజు ముందుగానే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నీచర్, మంచినీరు, విద్యుత్ వసతులు కల్పించాలన్నారు. ఈ విషయంలో ఉప విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా కో ఆర్డినేటర్ మహబూబ్‌బేగ్, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు శంకర్‌ప్రసాద్, వెంకటరామిరెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఏదీ?

- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: ఇసుక ఉచితంగా ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు అందుబాటులోకి తీసుకోరాలేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి విమర్శించారు. ఆళ్లగడ్డలో ఇసుక అందుబాటులో లేక పోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డలో శేఖర్ రెడ్డి అనే వ్యక్తి పేరుపై ఇసుక రీచ్ మంజూరు అయినప్పటికీ ఇంతవరకు అక్కడ టన్ను ఇసుక కూడా అందుబాటులో ఉంచలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇసుక అందుబాటులో లేక నిర్మాణ రంగం కుప్ప కూలి పోయిందన్నారు. దీనిని నమ్ముకున్న భవన నిర్మాణ కార్మికులు వేలాది మంది రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వ రీచ్‌లో ఇసుక ఇవ్వరు, బయట నుంచి తెచ్చుకుంటే పోలీసులు వాహనాలను సీజ్ చేస్తారు మరి ఇసుక అవసరమైన వారు ఏం చేయాలో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక రీచ్‌ను తక్షణమే తెరిపించి అందరికీ అందుబాటులో ఇసుక ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఇసుక ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ మసిపూసి మారేడు కాయ చేసినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా

ఉచిత గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ప్రభుత్వం ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తుందని చెప్పారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద శనివారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవిందనాయక్, డీఆర్ఓ రామునాయక్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టు చార్జీలు పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(అర్బన్): సివిల్ సప్లయ్ గోదాముల్లో పనిచేసే హమాలీలా యూనిఫాం కుట్టు చార్జీలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు డిమాండ్ చేశారు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డు సివిల్ సప్లయ్ గోదాములో శనివారం వారు హమాలీలతో సమావేశమై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలు పరిష్కరించాలంటూ 13 మాసాలుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో 5 గేదెలు మృతి



ప్రమాదంలో కాలిబూడిదైన పశువుల పాక

శిరివెళ్ల: మహదేవపురంలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు షేక్ మహబూబ్‌బాషాకు చెందిన 5 గేదెలు మృతి చెందాయి. మరో 9 గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు ఇంటి పక్కన ఉన్న పశువుల పాకలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ సంభవించి ప్రమాదం జరిగింది. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ పుష్పకుమారి ఆదేశాల మేరకు ఆర్ఐ రాఘవేంద్రకుమార్, పశు వైద్యులు శ్రీనివాసులు, ప్రతాప్ ప్రమాద స్థలానికి చేరుకొని రైతును విచారించారు. మరణించిన, గాయపడిన గేదెలను పరిశీలించారు. ప్రమాదంలో రూ. 10 లక్షలు దాకా నష్టం జరిగిందని బాధిత రైతు డాక్టర్ల ఎదుట వాపోయారు.

జిల్లాలో 91.53 శాతం పింఛన్ల పంపిణీ



రైతునగరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో 91.53 శాతం పింఛన్ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 2,15,031 పింఛన్ దారులకు గాను 1,96,821 మందికి గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారన్నారు. నంద్యాల పట్టణంలోని రైతునగరంలో శనివారం ఆయన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పంపిణీ చేశారు.

గోస్పాడు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ట్రైనీ డీఎస్పీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రైనీ డీఎస్పీ రాజసింహారెడ్డి

గోస్పాడు: గోస్పాడు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ట్రైనీ డీఎస్పీ రాజసింహారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. స్టేషన్‌లో 9 వారాల పాటు ఎస్ఐ విధుల నిర్వహణ నిమిత్తం నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన జిల్లెల్లలోని పోలీసు పికెటింగ్ పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందిని గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దీబగుంట్ల మెట్టవద్ద వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, లైసెన్స్‌లు సక్రమంగా లేని వారిని గుర్తించి జరిమానాలను విధించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ వెంకటప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకుడు నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): ధనార్జనే ధ్యేయంగా పేద ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. లేకపోతే తామే ప్రైవేటు ఆసుపత్రుల ఎదుట ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆసుపత్రులు పుట్టుకొస్తున్నాయన్నారు. ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తూ వైద్యం నిల్.. వసూళ్లు ఫుల్‌గా ప్రైవేటు ఆసుపత్రుల పనితీరు ఉందన్నారు. అయితే, జిల్లా అధికారులు ఆ ఆసుపత్రులపై కన్నెత్తి చూడటం లేదని, నిబంధనలు పాటించకపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి విష్ణు, నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



సైన్స్‌ఫేర్ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని నంద్యాల డిప్యూటీ డీఈఓ డీటీ శంకర్ ప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇన్నర్‌వీల్ సభ్యులు వసుంధర, అధ్యక్షులు విజయ, పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత హాజరై సర్ సీవీ చిత్రపటానికి పూలమాల వేసి సత్కరించారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు రకరకాల కూరగాయలు, పండ్లు, విజ్ఞాన శాస్త్ర సంబంధించిన చిత్రాలను చక్కగా ప్రదర్శించడం సంతోషకరమన్నారు. ప్రకృతిలో ప్రతి వస్తువును సృజనాత్మకతతో క్రోడీకరించి విద్యార్థుల ప్రదర్శనలో ఉంచడం కనువిందు చేశాయన్నారు. అనంతరం విజేతలకు ఇన్నర్‌వీల్ సభ్యులు బహుమతులు అందజేశారు. రైన్‌వాటర్, ఇన్‌స్పైర్ అవార్డ్స్, మంకీగన్, సోలార్‌సిస్టమ్ ఈ సైన్స్‌ఫేర్‌లో అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీయొద్దు



సంతకాల సేకరణ చేపట్టిన ఎల్ఐసీ సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): బీమా రంగంలోకి విదేశీ కంపెనీలను ఆహ్వానించి దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీయొద్దని ఆల్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ నంద్యాల బ్రాంచ్ అధ్యక్షుడు రవిశంకర్ శుక్లా అన్నారు. దేశానికి ఆర్థిక భద్రత ఇచ్చేది ప్రభుత్వరంగ సంస్థలేనని, భారతీయ బీమా మార్కెట్లోకి పూర్తిస్థాయి విదేశీ కంపెనీలను అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను నిరసిస్తూ శనివారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ సిబ్బంది సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని మున్సిపల్ పార్కు మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌బాబు, రవిశంకర్ శుక్లా మాట్లాడారు. ఎల్ఐసీకి పోటీగా అమెరికాలో దివాళ తీసిన ఏఎంజీ సాక్స్ లాంటి విదేశీ కంపెనీలను మన గడ్డపై అనుమతించాల్సిన అవసరం లేదన్నారు. ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లును హడావుడిగా ఆమోదింపజేసి బీమా రంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆమోదించాలన్న కేంద్ర ప్రభుత్వం చర్య అప్రజాస్వామికం అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శేషగిరిరావు, హరిప్రియ, సెక్రటరీ భువనేంద్ర, వెంకటరాముడు, మధు, సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లోపు గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

- నియోజకవర్గంలో 4,810కిగాను 2,814 ఇళ్లు పూర్తి
- డీఈ నాగరాజు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ జ్యోతి

జూపాడుబంగ్లా: గత ప్రభుత్వంలో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఈ ఏడాది జూన్‌లోగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి లబ్ధిదారులకు కుల ధృవీకరణ పత్రాలతోపాటు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం డీఈ స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గానికి 4,810 పక్కా గృహాలు మంజూరు కాగా 2,814 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 1,996 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు నిర్మించుకొంటున్న పక్కాగృహాల మొత్తాన్ని రూ.1.80 లక్షలకు తోడు మరింత మొత్తం పెంచే అవకాశాలున్నాయన్నారు. సొంత స్థలాలు కలిగిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ జ్యోతి ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శనివారం నిత్యకళావేదికపై తిరుపూరుకు చెందిన గోదా నాగమణి వారు భక్తిరంజని, శ్రీశైలానికి చెందిన నటరాజ నృత్యకళాశాల వారు సంప్రదాయ నృత్యప్రదర్శన, అలాగే హైదరాబాద్‌కు చెందిన సాయి మ్యూజిక్ అకాడమీ వారు ప్రదర్శించిన వీణవాదం కార్యక్రమాలు నిర్వహించారు.

పింఛన్‌దారులకు సర్వర్ కష్టాలు



సర్వర్ సమస్య చూపుతున్న యాప్



ఉయ్యాలవాడలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేసేందుకు వేలిముద్ర తీసుకుంటున్న దృశ్యం

ఉయ్యాలవాడ : వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 1వ తేదీన వేకువజామునే పింఛన్ తీసుకున్న లబ్ధిదారులకు ఇప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వలంటీర్లను తొలగించడంతో పాటు ఇంటి వద్ద పెన్షన్ల పంపిణీని పూర్తి స్థాయిలో చేపట్టడం లేదు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాజాగా ఈనెల సర్వర్ సమస్యతో సకాలంలో పింఛన్ తీసుకోలేని పరిస్థితి. మండలకేంద్రం ఉయ్యాలవాడలో ఒక్కో లబ్ధిదారుడు రెండుమూడుసార్లు ప్రయత్నించినా వేలుముద్రలు పడలేదు. దీంతో గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. అధికారులు మాత్రం తొలి రోజే 90 శాతానికి పైగా ఫించన్లు పంపిణీ చేశామని గొప్పలు చెబుతున్నారే తప్పా సాంకేతిక కారణాల వల్ల క్షేత్రస్థాయిలో కింది స్థాయి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవీ-ఇవీ

నిరుద్యోగులకు ఉపాధి కల్పన

నంద్యాల(న్యూటౌన్): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రైనింగ్ కోర్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్కిల్‌హబ్ సెంటర్ నందు వెబ్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులకు మార్చి 3వ తేదీ నుంయి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుకు ఇంటర్, ఆపై చదివిన వారు, వెబ్ డెవలపర్ కోర్స్‌కు డిగ్రీ లేదా బీటెక్ కంప్యూటర్ చదివిన వారు అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం సెల్ : 82978 12530 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

గోస్పాడు/శిరివెళ్ల: ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గోస్పాడు మండలంలో దీబగుంట్ల, గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తొలిరోజు నిర్వహించిన మొదటి సంవత్సర తెలుగు పరీక్షకు 14 మంది గైర్హాజరయ్యారు. దీబగుంట్లలో 258కి 254, గోస్పాడులో 255కు 245 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాళ్లు బాలచంద్రుడు, రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

- శిరివెళ్ల మండలం యర్రగుంట్ల పరీక్షా కేంద్రంలో తొలి రోజు 8 మంది విద్యార్థులు గైరాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమణ కుమారి తెలిపారు. కేంద్రంలో 115 మందికి గాను 107 మంది పరీక్ష రాశారన్నారు

ఆలయంలో హుండీ చోరీ

శిరివెళ్ల: స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాకా ఇరువురు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపులు పగల గొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారు జామున ఆలయాన్ని శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్ గమనించి ఆలయ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చింది. అతను వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ చిన్న పీరయ్య గుడికి చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. హుండీతో పాటు రూ. 5 వేల నగదు చోరీకి గురయిందని అధ్యక్షుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు పెట్టారు.

నకిలీ నోట్ల వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో గత రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న నకిలీనోట్ల వ్యవహారంపై శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం శ్రీశైల దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నకిలీనోట్ల విషయంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారణ జరిపిస్తున్నామని వెల్లడించారు.

27 నుంచి ఉగాది ఉత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు జరగనున్నాయి. మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం దేవస్థాన పరిపాలన భవనంలో అన్ని విభాగాల అధికారులు, వేదపండితులతో ఈఓ శ్రీనివాసరావు సమావేశమై చర్చించారు.

ప్రజాసంక్షేమం ఊసేలేని బడ్జెట్



కోవెలకుంట్ల జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం ఊసే ఎత్తలేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. శనివారం ఏపీ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నూనెపల్లెలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూడు పథకాలకు మాత్రమే అరకొర నిధులు కేటాయించారన్నారు. మిగతా పథకాల ఊసే లేదన్నారు. 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తుంగలో తొక్కారన్నారు. నిరుద్యోగ భృతి, రైతు సంక్షేమం, పంటల గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలపైన అన్ని రకాల భారాలు వేసినట్లు బడ్జెట్ ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, సీనియర్ నాయకులు తోటమద్దులు, తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు



అలయ ప్రాంగణంలో భోగేశ్వరుడిని హుండీ లెక్కిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలో గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరస్వామి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. ఈ మహాశివరాత్రికి రూ.3,49,394 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపును సీఎఫ్ఓ హరిచంద్రారెడ్డి, పర్యవేక్షించారు. కార్యక్రమంలో సేవాకమిటీ సభ్యులు, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఇంజేడు శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్. జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరి స్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, అనంతయ్య, భాస్కర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆర్డీవో విశ్వనాథ్, డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. అహోబిలం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థాన నిర్వాహకులు అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మట్లాడుతూ ఈ నెల 3 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎగువ, దిగువ అహోబిలాలతో పాటు నవ నారసింహ క్షేత్రాల పరిధిలో చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అహోబిలం మఠం ప్రతినిధి మురళీధరన్, ఆర్డీఓ విశ్వనాథ్, డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ రత్నకుమారి, ఎంపీడీఓ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, అటవీ, వైద్యారోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేత్రాలు దానం



మృతుడి నేత్రాలు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

గోస్పాడు: నంద్యాల పట్టణంలోని స్టేట్ బ్యాంక్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు(74) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందగా ఆయన నేత్రాలు దానం చేసేందుకు భార్య పద్మావతి, కుమార్తెలు లక్ష్మీకుమారి, సుమలత, మంజుశ్రీ, మహేశ్వరి కర్త ముందుకు వచ్చారు. ఈ విషయం ఫ్రెండ్స్ ఫర్ సేవా సొసైటీ ప్రతినిధులు బాపూజీనాయక్, కిశోర్ తెలియగా వారు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం ఇచ్చారు. వారు మృతుడు వెంకటేశ్వర్లు ఇంటికి చేరుకొని ఆయన నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. మృతుడు పట్టణంలోని ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేసేవారు. ఇతని రెండు కళ్లను దానం చేసిన కుటుంబసభ్యులకు పలువురు అభినందించారు.

నంద్యాలకు తిరుగుపయనమైన పెళ్లిపెద్దలు



నంద్యాలకు వెళ్తున్న పార్వతీ, బ్రహ్మనందీశ్వరస్వామి



కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

మహానంది: మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెళ్లి పెద్దలుగా వచ్చిన నంద్యాల బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వార్ల ఉత్సవాలు పూర్తయిన నేపథ్యంలో శనివారం తిరిగి నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు శాంతారాంభట్, అర్చకులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు రుద్రగుండం కోనేరులో చక్రస్నానం అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలకంరించారు. మేళతాళాల మధ్య గ్రామోత్సవంగా నంద్యాలకు తరలివెళ్లారు. పూజల్లో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం చిన్నా, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయ అర్చకులు సురేష్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా వృషభాల జయకేతనం

మహానందిలో శనివారం నిర్వహించిన ఒంగోలు జాతి న్యూ కేటగిరీ విభాగం బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన తేజశ్రీ రెడ్డి వృషభాలు మొదటి స్థానం కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి ఎద్దులు నిలిచాయి. ఎద్దుల యజమానులకు రూ.60వేలు, రూ.50వేలు నగదు బహుమతులు అందించారు. మూడో స్థానంలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలానికి చెందిన తోట శ్రీనివాసరావు, కొత్తపల్లికి చెందిన వెంకట హారిక వృషభాలు నాలుగో స్థానంలో నిలిచాయి ఇదిలా ఉండగా ఈ ఏడాది మహానందిలో నిర్వహించిన ఒంగోలు జాతి ఎద్దుల పోటీలకు స్పందన అంతగా లభించలేదు. శుక్రవారం జరిగిన పాలపండ్ల విభాగంలో కేవలం మూడు జతల ఎద్దులు మాత్రమే రావడం రైతులకు నిరుత్సాహం కలిగించింది. సరైన ప్రచారం లేకపోవడంతోనే స్పందన పెద్దగా రాలేదని పలువురు చర్చించుకున్నారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానందిలో శనివారం వీకెండ్ కావడంతో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్థానిక రెండు చిన్న కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని, పూజలు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. రాత్రి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు ఏకాంతసేవ పూజలు నిర్వహించారు.